కథ

సుధ

# హాలు చప్పట్లతో దద్దరిల్లుతోంది.

**'అంత్యాక్షరి' పోటీల ఫైనల్లో గెలిచిన చైతన్య స్టేజి దిగకముందే అందరూ చుట్టు ముట్టారు. భుజం చరిచి అభినందనలు తెలిపేవారు కొందరు, చేతులుపట్టి ఊపేస్తూ తమ సంతోషం ప్రకటించేవారింకొందరు. అయితే చైతన్య దృష్టి తనను చుట్టుముట్టిన వారిపై లేదు. దూరంగా నిలబడిన అపురూప పైనే ఉంది.**

నిజానికి చైతన్య పార్టనర్ రాము ఉట్టి దిష్టిబొమ్మే. పాటలు పాడింది, ప్రశ్నలకు వెంటనే సమాధానాలిచ్చింది అంతా చైతన్యే. అందుకే అందరూ చైతన్య చుట్టూ మూగారు. అతని జ్ఞాపకశక్తికి క్షణంలో సరైన పాటనూహించిన ఊహాశక్తికి ఆశ్చర్యం ప్రకటిస్తున్నారు.

'ఈ పోటీలో గెలిస్తే షేక్‌హ్యాండిస్తానంది' అపురూప. ఆమె కోసమే పోటీలో పాల్గొన్నాడు. ఆమె షేక్‌హ్యాండ్ కోసమే పోటీలో గెలిచాడు. అందుకే తన దగ్గరకు వచ్చేందుకు ఎదురుచూస్తున్నాడు చైతన్య.

ఇంతలో అపురూప కదిలింది.

చైతన్య కళ్లు మెరిశాయి. అతని గుండె దడదడలాడసాగింది.

అపురూప నిజంగా అపురూపే. ఆమెను వర్ణించేందుకు మాటలు చాలవు. పాలరాతిలోని తెల్లదనం, వెన్నెలలోని చల్లదనం, సూర్యుడి వాడితనం, మేఘాల్లోని మెరుపు, పూలరేకుల మృదుత్వం, ప్రకృతిలోని రంగులు...ఒకటేమిటి అనంతమైన అందాలన్నీ ఒకచోట కుప్పపోసి కలిపి మిశ్రమం తయారుచేసి ప్రాణం పోస్తే మనిషి రూపమిస్తే ఎలా ఉంటుందంటే, 'అపురూప'లా ఉంటుంది.

గతంలో ఒక్కసారి అపురూప షేక్‌హ్యాండిచ్చింది.

ఆమె స్పర్శ నుండి ఏదో విద్యుత్ అతడి నరనరానా పాకింది. అతడి శరీరంలో నిద్రాణ స్థితిలో ఉన్న సంస్కారాన్ని ఆ విద్యుత్ జాగృతం చేసింది. ఆమె చేయి తన చేతిలో ఉన్న క్షణంలో అతడికి తాను వేరు, ఈ ఆనందాన్ని అనుభవిస్తున్న ఆత్మ వేరు అనిపించింది. ఆమె స్పర్శతో తాను పునీతుడయిన భావన కలిగింది చైతన్యకు. మేఘాలలో తేలుతున్నట్టు, తరంగ శృంగారాలపై నడయాడుతున్నట్టు భావన కలిగింది. ఆరోజు ఎలా ఇంటికి చేరాడో అతనికే తెలియదు. ఏదో మధురమైన మత్తులో ఉన్నాడతడు. రాత్రంతా నిద్రపట్టలేదు. ఆమె స్పృశించిన తన చేతివైపే చూస్తూ కూర్చున్నాడు. ఇంతలో కిటికీలోంచి ఓ వెన్నెల కిరణం అతడి చేతిపై వాలింది. కాదు అతని చేతికి ఉన్న అపురూప స్పర్శానుభూతిని దొంగిలించేందుకు వెన్నెల దొంగతనంగా దూరి మరీ తన చేతిపై వాలుతోందనిపించింది.

ఇంతలో విచిత్రంగా వెన్నెల మానవాకృతిని దాల్చటం ఆరంభించింది. అది అపురూప! ఇంతలో వెన్నెల వ్రేళ్లు మృదువుగా అతడి చేతిని స్పృశించాయి.

తెల్లవారి కాగితాల రెపరెపలకు మెలకువ వచ్చింది చైతన్యకు.

లేచి చూశాడు. నమ్మలేకపోయాడు.

ఈ కవిత రాసింది తానేనా? లేక ఎవరైనా తన వ్రేళ్లు పట్టుకుని తనతో కవిత రాయించారా?

ఇంకెవరు అపురూపే!

## షేక్ హ్యాండ్

ఆ కవిత ప్రచురితమై అందరూ పొగుడుతుంటే అపురూపకు ఆ కవిత చూపించాడు. "ఈ కవితకు ప్రేరణ నీ కరస్పర్శ. నీ షేక్‌హ్యాండ్‌తో నాకేమయిందో తెలియదు. నా ప్రమేయం లేకుండా ఈ కవిత రాశాను" మెరుస్తున్న కళ్లతో చెప్పాడు చైతన్య.

'కదిలే వెన్నెల నీవు
మదిలోని మృదుభావన నీవు
నా అపురూప స్వప్నాల సుందర రూపానివి నీవు
నా శృంగార కలల ప్రతిరూపానివి నీవు'

పైకి చదివి పెదవి విరిచింది అపురూప. ఇది గమనించలేదు చైతన్య.

"అపురూపా...నాకు మళ్లీ షేక్‌హ్యాండివ్వవా? ఇంకా అద్భుతమైన కవిత రాస్తాను" మళ్లీ ఆమె స్పర్శలోని ఆనందం అనుభవించాలని ఉంది చైతన్యకు. అంతేకాదు, గతంలో ఆమె చేతిస్పర్శ వల్ల తనలో కలిగిన స్పందన నిజమా, అబద్ధమా తెల్సుకోవాలని ఉంది.

కానీ చాచిన అతని చేయి అలానే ఉంది. ఆ చేతిని అపురూప అందుకోలేదు.

"ఇది అడాలసెంట్ కవిత్వంలా ఉంది" అంది తేలికగా.

"మరి అందరూ మెచ్చుకుంటున్నారు?" చైతన్యకు గుండె జారిపోయింది. ఆమె షేక్‌హ్యాండివ్వదా?

"అందరి మెప్పు నాకనవసరం. ఇంత చీప్ కవిత్వానికి నా షేక్‌హ్యాండ్ ప్రేరణ అయినందుకు నేను సిగ్గుపడుతున్నాను" అంది.

చైతన్య చేయి వెనక్కు తీసుకున్నాడు. అతడు తల వంచుకుని వెళ్లిపోతుంటే తనే పిలిచింది.

"మన ఆఫీసులో హిందీ పాటల అంత్యాక్షరి పోటీ ఉందట. ప్రతి సంవత్సరం ఆ ఉమ, రమలే గెలుస్తారు. ఈసారి నువ్వు గెలిస్తే షేక్‌హ్యాండిస్తాను" అనేసి వెళ్లిపోయింది.

ఆరోజు నుంచీ చైతన్య రాత్రింబవళ్లు హిందీ పాటలు వింటూ గడిపాడు. ఇన్నాళ్లూ గమనించలేదుగానీ పాటల్లోని సున్నిత భావనలు వింటుంటే చైతన్యలోని రొమాంటిక్ నిద్ర లేచాడు. పాటలోని ప్రతి వర్ణన అపురూపనే తలపుకు తెచ్చేది.

పోటీలో పాల్గొనేందుకు అతడికి సరైన పార్టనర్ దొరకలేదు. అతడికి పాటలొచ్చని ఎవరూ ఊహించలేదు. చివరికి హిందీ అక్షరం కూడా రాని ఓ కొలీగ్ రాముని బ్రతిమిలాడుకుని పోటీల్లో చేర్పిచ్చాడు.

ఒకో రౌండ్‌లో అందరినీ ఆశ్చర్యపరుస్తూ నెగ్గుతూ వచ్చాడు. ఎందుకంటే అపురూప మొదటి వరుసలో కూర్చుంది. ఆమెని చూస్తుంటే అతడిలో పాటల ప్రవాహం ఉబుకుతూ వస్తోంది.

'తను గెలవటం ఖాయం. అపురూప షేక్‌హ్యాండివ్వటం ఖాయం' ఈ ఆలోచనతో ఫైనల్‌కు ముందురోజు రాత్రి అతడికి నిద్ర పట్టలేదు.

ఇప్పుడు ఫైనల్‌లో గెలిచాడు. అందరి అభినందనలు అందుకుంటున్నా అపురూప కోసం ఎదురుచూస్తున్నాడు.

అపురూప అతని దగ్గరగా వచ్చింది.

చేయి చాచాడు చైతన్య.

"కంగ్రాట్స్" అంది అపురూప. చాచి ఉన్న అతడి చేయిని చూడనట్టే అనేసి ముందుకు వెళ్లింది.

'రాము' దగ్గరకు వెళ్లి 'వెల్‌డన్' అని చేతినందించింది. వాడు పరమానందంగా ఆమె చేతిని అందుకున్నాడు.

చైతన్య హృదయం భగ్నమంది. ఇక మళ్లీ అపురూపను పలకరించవద్దనుకున్నాడు. ఆమె వైపు చూడవద్దనుకున్నాడు. ఆమె జోలికి వెళ్లొద్దనుకున్నాడు. అపురూప లాంటి వ్యక్తి ఉన్నదని మరచిపోవాలనుకున్నాడు.

కానీ అతని చేయి, మనసు, శరీరం, ఆత్మ అపురూప స్పర్శనే కోరుతున్నాయి.అందుకే అవకాశం దొరకగానే ఎంత వద్దనుకుంటున్నా, అపురూపని నిలదీసి అడిగాడు.

"ఏమిటది సిల్లీగా? అంత్యాక్షరిలో గెలవటం గొప్పా. అదీ హిందీ పాటలు. మన ఆఫీసులో ప్రమోషన్ పరీక్ష పాసయి చూపించు. అంత చీప్ అనుకున్నావా నా షేక్‌హ్యాండ్?" ఆమె సీరియస్‌గా అంది. కానీ కళ్లు అల్లరిగా నవ్వుతున్నాయి.

"కానీ ఆ రామంగాడికి షేక్‌హ్యాండిచ్చావు?" అక్కసుగా అడిగాడు చైతన్య.

"నా ఇష్టం. నువ్వెవరు అడగటానికి?"

తల వంచుకున్నాడు చైతన్య.

అద్భుతమైన అలౌకికానందం కలిగించే స్పర్శ మరోసారి కావాలని తపన పడటంలో సిగ్గేముంది?

రాత్రింబవళ్లు చదువుతున్నాడు పరీక్ష కోసం. కన్ను మూత పడితే అపురూప నవ్వుతూ చాచిన తన చేతిని తిరస్కరించినట్టే కల వస్తుంది. ఇక నిద్రమాని లేచి కూచుని చదవటం ఆరంభిస్తాడు. చైతన్యకిప్పుడు ప్రపంచంలో రెండే అంశాలున్నాయి. ఒకటి పరీక్ష పాసవ్వటం, రెండు అపురూప షేక్‌హ్యాండ్ పొందటం.

★ ★ ★

పరీక్ష ఫలితాలు ప్రకటించే తేదీ దగ్గరపడుతున్నకొద్దీ అత

డిలో ఉద్విగ్నత అధికం కాసాగింది. రక్తనాళాలు చిట్లిపోతాయేమోనన్నంత టెన్షన్. ఫెయిలవుతాడని అనుకున్నా, అఫీషియల్‌గా ప్రకటించేదాకా ఏదో ఆశ ఉంటుంది. ఫలితాలు వచ్చాయి. చైతన్య ఫెయిల్ కాలేదు. గబగబా అపురూప సీటు వద్దకు పరుగెత్తుకు వెళ్లాడు.

సీటు ఖాళీగా ఉంది.

వేరే ఉద్యోగం రావటంతో వెళ్లిపోయిందట అపురూప.

"ఉద్యోగం సంవత్సరం క్రితమే వచ్చింది. ఇన్నాళ్లు పోస్టింగ్ కోసం ఎదురుచూసింది" అని చెప్పింది పక్కసీటు ఆవిడ.

"ఎక్కడ వచ్చింది ఉద్యోగం?" అడిగాడు చైతన్య.

"ఏమో తెలియదు. ఎవరికీ తెలయదు."

చైతన్యకు పిచ్చి పట్టినట్టయింది. ఇన్నాళ్లు కలలు కన్నరోజు నిజమై దగ్గరకు వచ్చేసరికి కల్లలయిపోయాయి. అయినా ఏమిటీ పిచ్చి తనకు? పోస్ట్‌మేన్ ఉత్తరం తెచ్చిచ్చి వెళ్లాడు. పరిచయం లేని చేతిరాత. సంబోధన లేదు.

"మీకు షేక్‌హ్యాండివ్వకుండా పారిపోయాననుకున్నారా? అదేమీ లేదు. మామూలు ప్రమోషన్ పరీక్ష పాసవ్వటంలో గొప్ప ఏముంది? సివిల్ సర్వీస్‌లో సెలెక్ట్‌కండి. నేనే వెతుక్కుంటూ వచ్చి మీ చేయి పట్టుకుంటాను. అదే షేక్‌హ్యాండిస్తాను" సంతకం లేదు. కానీ రాసిందెవరో తెలుస్తోంది.

నిస్పృహగా అనిపించింది చైతన్యకు. సివిల్ సర్వీస్ పాస్ కాగలడా? రాస్తే ఇదే చివరి అవకాశం అవుతుంది. వయసయిపోతోంది.

అంతలో మరో ఆలోచన...ఏమో... అపురూప నిజమే చెప్తోందేమో! తనా సివిల్ సర్వీస్‌లో సెలక్టయితే అపురూప షేక్‌హ్యాండిస్తుందేమో!

ఆ ఆలోచనే అద్భుతంగా ఉంది. అతని గుండె ఝల్లుమంది. అపురూప తనంతట తాను వెతుక్కుంటూ వచ్చి తనకు షేక్‌హ్యాండివ్వటమా?

అతని కళ్లముందు ఆ సుందర దృశ్యం కనబడసాగింది. వెంటనే వివరాలు సేకరించాడు. చదవటం ఆరంభించాడు. పరీక్ష పోటీ ప్రకటించగానే అప్లై చేశాడు.

ఇప్పుడు చైతన్యకు వేరే లోకం లేదు.

రాత్రింబవళ్లు చదువుతున్నాడు. కళ్లుమూసుకుంటే అపురూప గురించి కలలు కంటున్నాడు. ఆమె చేయి తనని తాకినట్టు ఊహించి మురిసిపోతున్నాడు.

మెయిన్స్ పాసయ్యాడు. ఇంటర్వ్యూకు వెళ్లాడు.

పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. అన్నీ చూడకుండానే తిరస్కరిస్తున్నాడు. అతనికి సివిల్ సర్వీస్‌లో సెలెక్టవ్వాలని ఉంది. అపురూప షేక్‌హ్యాండ్ సాధించాలని ఉంది.

"అమ్మాయి నిన్ను చూసి ఇష్టపడిందట" అమ్మ చెప్తే విననట్టే చూశాడు.

రిజల్ట్స్ వచ్చాయి. చైతన్య సెలక్టయ్యాడు.

అందరూ అభినందిస్తున్నారు. సంతోషిస్తున్నారు. కానీ చైతన్యలో ఆనందం లేదు.

ఏదీ అపురూప? అతనికి నిరాశగా అనిపించింది.

సివిల్ సర్వీస్ సాధించాడు దేనికోసం?

షేక్‌హ్యాండ్ కోసం! నవ్వొచ్చింది.

తన మూర్ఖత్వానికి నవ్వొచ్చింది. అంతలో తన



మూర్ఖత్వం పిచ్చితనం కాకుండా, తన అభివృద్ధికి కారణమయ్యేట్టు చేసిన అపురూప తెలివికి నవ్వొచ్చింది. తనంత దురదృష్టవంతుడు మరొకడు లేడు. అపురూప లాంటి అమ్మాయిని జారవిడుచుకున్నాడు.

షేక్‌హ్యాండ్ కోసం వెంటపడ్డాడు కానీ ఆమె చేయి అందుకోవాలన్న ఆలోచన కూడా రాలేదు. తనంత మూర్ఖుడు ఎవరైనా ఉంటారా?

"ఏరా, అమ్మాయిని కలుస్తావా? నిన్ను మరీ మరీ ఇష్టపడుతోందిట. కదుల్తావా లేదా?" అరిచింది అమ్మ.

"ఇంక ఏ అమ్మాయిని చూసి ఏంచేస్తాడు? వసంతం సైతం చూసి మురిసి గర్వపడే పుష్పాన్ని చేజేతులారా జారవిడుచుకున్నాడు. ఎదురుగా ఉన్నన్నాళ్లు విలువ తెలుసుకోలేకపోయాడు. ఇంకెవరు తనకు అంతగా స్ఫూర్తినిస్తారు? ఎవరు తనలోని చైతన్యాన్ని ఇంతలా స్పందింపజేస్తారు? గదిలోకి ఎవరో వచ్చినట్టు మెత్తని అడుగుల శబ్దం వినిపించింది.

తలెత్తి చూశాడు. నమ్మలేకపోయాడు.

ఎదురుగా అపురూప.

ఇది కలా? నిజమా? ఎన్నోసార్లు కలను నిజమని భ్రమపడ్డాడు. ఇప్పుడు నిజాన్ని కల అని భ్రమపడుతున్నాడు.

"ఛాలెంజ్‌గా తీసుకోరేమోనని భయపడి చచ్చాను" అంది అపురూప.

చైతన్యకు అవేవీ వినపడలేదు. అపురూప తన మాట నెరవేర్చుకునేందుకు వచ్చింది. తనను షేక్‌హ్యాండిచ్చేందుకు వచ్చింది. ఆమెను మరోసారి చేజారిపోనివ్వకూడదు.

ఒక్క ఉదుటున లేచి ఆమె ముందు మోకరిల్లాడు చైతన్య. ఇన్నాళ్లు అతను తనలో అణచుకున్న ఆశలు, నిరాశలు, ఆవేదనలు, ఉద్విగ్నతలు అన్నీ కన్నీళ్ల రూపంలో బయటకు రాసాగాయి.

అపురూప వంగి అతడి తలను ఒడిలోకి తీసుకుంది. నెమ్మదిగా అతడి తలను తన హస్తాలతో నిమరసాగింది.

"సారీ... నిన్ను చాలా కష్టపెట్టాను. కానీ ఏం చేయను చెప్పు? మాటిమాటికీ చేయి కలపలేను. ఇతరులతో అంటే ఒక్కసారి కలిపి వదిలేస్తాం. కానీ నీతో చేయి కలిపిన తరువాత వదలాలని అనిపించలేదు. అందుకే భయపడ్డాను మళ్లీ షేక్‌హ్యాండిచ్చేందుకు. అప్పటికీ నాకు ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది. క్ల్కర్కైన నీతో పెళ్లంటే మా ఇంట్లో అభ్యంతరం వస్తుంది. అందుకే సివిల్ సర్వీస్ కండిషన్ పెట్టాను. పాసవ్వవేమో అని హడలి చచ్చాను. చివరికి ఇంట్లో ఒప్పించాను. నువ్వు పాసవ్వకున్నా చేసేసుకుందామనుకున్నాను. కానీ ఎక్కడా... నువ్వు పెళ్లి మాటే తలపెట్టలేదు. అందుకే రిజల్ట్స్ దాకా ఎదురు చూశాను. టెన్షన్‌తో చచ్చిపోయాననుకో."

చైతన్యకు ఆమె మాటలేవీ వినబడటం లేదు. ఆమె ఒడిలో తలపెట్టుకుంటే, గలగల పారే మంచు కరిగిన నీటి సరస్సు పక్కన పడుకుని ఆకాశాన్ని తాకే మంచుకొండల సౌందర్యాన్ని చూస్తున్నంత అద్భుతంగా ఉంది. తలపైని ఆమె చేతిస్పర్శ నది ఉపరితలాన్ని మృదువుగా స్పృశిస్తున్న చల్లగాలి తరంగాల్లా ఉంది. నదిలో అలలు జనించినట్టు అతని హృదయంలో శరీరంలో ఆనంద తరంగాలు ఎగసిపడుతున్నాయి.

అతనికి ఒక విషయం అర్థమైంది. ఇక ఎప్పటికీ ఆమె చేయి తన చేతిలోనే ఉంటుంది. ఈ షేక్‌హ్యాండ్ కాలపరిమితి ఒక్క నిమిషమో సెకనో కాదు ఒక జీవితకాలం. ఇది జన్మజన్మల బంధం! ఆమె చేయి పట్టుకుని తాను అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తాడు. చైతన్య చైతన్యవంతుడయ్యాడు.

"ఇక నా చెయ్యి విడవవు కదా?" అడిగాడు చైతన్య.

"ఏమిటా ప్రశ్న సిల్లీగా?" అంది అపురూప నవ్వుతూ.

*